క్లుప్తంగా

ఆదర్శ వేదిక సేవలు అభినందనీయం

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు



రేపల్లె: ప్రజా సమస్యలను అధికారులకు తెలియజేయడంతో పాటు ఆదర్శ వేదిక పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు అన్నారు. పట్టణ ఆదర్శ వేదిక ఆధ్వర్యంలో దాతల సహకారంతో పెద్ద కూరగాయల మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. పట్టణ ప్రజలు బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్ బాబు, అధ్యక్షుడు బి.వి.మోహన్ రావు, సభ్యులు కె.ఆనందరావు, పి.జవహర్, గుంటి సాంబశివరావు, ఇమాముద్దీన్, ఎస్.విజయకుమార్, ఎస్.నాంచారయ్య తదితరులు పాల్గొన్నారు.

12న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమర్తలూరు(వేమూరు): మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 12వ తేదీన నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీవో మారుతీ శేషాంబ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీపీ రాపర్ల నరేంద్ర అధ్యక్షత వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశం ఈ నెల 12న మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. సమావేశానికి 21 శాఖల అధికారులు తప్పకుండా హాజరు కావలెనాని ఆమె కోరారు.

యుద్ధ సన్నద్ధతపై అవగాహన

రేపల్లె : విపత్కర పరిస్థితులు ఎదురై ప్రజలు ప్రమాదాల బారిన పడితే అత్యవసర వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది సిద్ధంగా ఉండాలని రేపల్లె ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ సుధాకర్ రావు చెప్పారు. భారత్ - పాక్ మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నందున ప్రజలు ప్రమాదాల బారిన పడితే ఎటువంటి వైద్య సేవలు అందించాలనే అంశంపై స్థానిక వైద్యశాలలో గురువారం సిబ్బందికి యుద్ధ సన్నద్ధతపై అవగాహన కల్పించారు. యుద్ధం నేపథ్యంలో ఉగ్రవాదులు చొరబడి దాడులకు పాల్పడితే ప్రజలు గాయాలపాలయ్యే ఆస్కారం ఉందన్నారు. ఈ నేపథ్యంలో అత్యవసర వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బంది నిరంతరం సిద్ధంగా ఉండాలని చెప్పారు. పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు గణేష్, జీవన్, శివన్నారాయణ, ఆర్తి భూషణ్, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు చానల్‌లో పడి వ్యక్తి మృతి



పెదకాకాని: ప్రమాదవశాత్తూ కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన తక్కెళ్లపాడులో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన షేక్ మీరావలి (51) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాడు. గురువారం గ్రామంలోని జెండా చెట్టు పక్కనే ప్రవహిస్తున్న గుంటూరు చానల్(కొత్త కాలువ) గోడపై కూర్చున్నాడు. ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలో పడ్డాడు. చుట్టుపక్కల వారు గుర్తించి కాపాడే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే మీరావలి మృతి చెందాడు. మృతదేహాన్ని ఇంటికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

కనుల పండువగా వేణుగోపాలస్వామి కల్యాణం

నగరం: మండలంలోని పూడివాడ గ్రామంలో వేణుగోపాలస్వామి దేవస్థాన వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం కౌతుకోత్సవ కార్యక్రమాన్ని శాస్త్రయుక్తంగా నిర్వహించారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ వేణుగోపాలస్వామి దివ్య కల్యాణ మహోత్సవాన్ని కనుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విశేష పూజలు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రజల సమస్యలపై అశ్రద్ధ వద్దు

తెనాలి అర్బన్: ప్రజల సమస్యలపై అశ్రద్ధ వద్దని, వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం. లక్ష్మీపతి రావు సిబ్బందికి సూచించారు. అయితానగర్ డాంగేవారి వీధిలో గురువారం ఆయన పర్యటించారు. ఆ ప్రాంతంలో జరుగుతున్న పారిశుద్ధ్య పనుల్ని పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెనాలి పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలంతా తమ ఇంట్లో చెత్తను తడి, పొడిగా వేరుచేసి కార్మికులకు అందజేయాలని సూచించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సదరం క్యాంప్ పునః ప్రారంభమయ్యేనా..?!

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీహెచ్‌సీలోనే నిర్వహణ
- నిలిపి వేసిన కూటమి ప్రభుత్వం
- వ్యయ ప్రయాసలతో ఇబ్బందులు పడుతున్న దివ్యాంగులు



సామాజిక ఆరోగ్య కేంద్రం, వేమూరు

వేమూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్ నిలిపి వేశారు. దీంతో సదరం సర్టిఫికెట్ల కోసం దివ్యాంగులు, మూగ, చెవిటి, పక్షవాతం గల వారు తదితరులు నానా అవస్థలు పడుతున్నారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్ పునః ప్రారంభం ఎపుడు చేస్తారని దివ్యాంగులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

ప్రస్తుత ప్రభుత్వంలో...

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత సామాజిక ఆరోగ్య కేంద్రాల్లోని సదరం క్యాంప్‌ను నిలిపివేశారు. దీంతో దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం మరలా జిల్లా వైద్యశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో దివ్యాంగులపై ప్రయాణ ఖర్చుల భారం పడింది. కూటమి ప్రభుత్వం సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో సదరం క్యాంప్ పునః ప్రారంభం చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు.

జిల్లా వైద్యశాలలకు వెళ్లాల్సిన పరిస్థితి

గత ప్రభుత్వంలో వేమూరు నియోజకవర్గంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలోని సదరం క్యాంప్‌కు వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు, అమర్తలూరు, చుండూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో దివ్యాంగులకు, చెవిటి, మూగ, పక్షవాతం గల వ్యక్తులు రావడం జరిగింది. వైద్యులు పరీక్షలు చేసి సదరం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

+ కూటమి ప్రభుత్వంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్ నిలిపి వేయడంతో మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులు, మూగ, చెవిటి, పక్షవాతం గల వ్యక్తులు సదరం సర్టిఫికెట్ల కోసం తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో...

గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైద్యశాలల్లో సదరం క్యాంప్ నిర్వహించడం జరిగింది. దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ల కోసం జిల్లా వైద్యశాలలకు వెళ్లడం కష్టం. అలాగే ప్రయాణ ఖర్చుల భారం కూడా పడుతుంది. దివ్యాంగుల వ్యయ ప్రయాసలను తగ్గించాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్ ఏర్పాటు చేశారు. దీంతో జిల్లా ఆరోగ్య కేంద్రం నుంచి ప్రతి సామాజిక ఆరోగ్య కేంద్రానికి సదరం క్యాంప్‌కు డాక్టర్లను పంపించడం జరిగింది. వైద్యులు దివ్యాంగులకు పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు మంజూరు చేశారు. దీంతో దివ్యంగులకు సర్టిఫికెట్లు పొందడం సులభం అయింది.

పునః ప్రారంభం చేయాలి



వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్‌ను పునః ప్రారంభం చేయాలి. సామాజిక ఆరోగ్య కేంద్రంలో సదరం క్యాంప్ లేకపోవడంతో దివ్యాంగులు జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు సదరం సర్టిఫికెట్ల కోసం వెళ్లాల్సిన పరిస్థితి. నేను వేమూరు సీహెచ్‌సీలోనే సదరం సర్టిఫికెట్ పొందాను.

– గుంటూరు పవన్, దివ్యాంగుడు, కొల్లూరు

క్యాంప్ ప్రారంభించాలి



సామాజిక ఆరోగ్య కేంద్రంలో కూటమి ప్రభుత్వ అధికారం చేపట్టిన తర్వాత సదరం క్యాంప్ నిలిపి వేసింది. కూటమి ప్రభుత్వం సీహెచ్‌సీలో సదరం క్యాంప్ తిరిగి ప్రారంభించాలి. దాంతో ఎంతో మంది దివ్యాంగులకు ఉపయోగం ఉంటుంది.

– దాసరి బసవయ్య, దివ్యాంగుడు, వేమూరు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు నాగాంజనేయులు

రేపల్లె : కార్మికులను బానిసలుగా మార్చే 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 20న కార్మిక సంఘాలు నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో గురువారం కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కాలరాసేందుకు కుట్ర పన్నుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయనున్న నాలుగు లేబర్ కోడ్‌లు అమల్లోకి వస్తే కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోవటమే కాక వెట్టిచాకిరీకి గురువుతారన్నారు. ఈ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌లతో జరుగుతున్న సమ్మెలో కార్మికులు ఐక్యంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ మాట్లాడుతూ పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను కాలరాసేలా వ్యవహరిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పేలా కార్మికులు ఐక్య ఉద్యమాలకు సిద్ధపడాలన్నారు. కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి వచ్చేలా కార్మికులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. తొలుత ఇటీవల మృతి చెందిన ఏఎస్ఎం కోటేశ్వరమ్మకు రెండు నిమిషాలు మౌనం పాటించారు. సమావేశంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు బి.కుసుమకుమారి, తాపీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు జి.శ్రీమన్నారాయణ, వివిధ కార్మిక సంఘాల నాయకులు కె.వెంకటరమణ, జయమ్మ, కాగిత శ్రీనివాసరావు, కొలుసు సురేష్, సమ్మెట శ్రీనివాసరావు, యార్లగడ్డ కనకదుర్గ, గూడూరు అనూష, పరుచూరి పద్మావతి, వేణు, వీరరాఘవయ్య, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలి

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయ్‌బాబు



కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు

రేపల్లె: కౌలు రైతులు కౌలు గుర్తింపు కార్డులను తప్పనిసరిగా పొందాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఆర్.విజయ్‌బాబు చెప్పారు. మండలంలోని బేతపూడి రైతు సేవా కేంద్రంలో గురువారం నిర్వహించిన కౌలు రైతు కార్డుల దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులు గుర్తింపు కార్డులు పొందటంతో అనేక లాభాలు చేకూరుతాయన్నారు. పంటల బీమా, నష్ట పరిహారం, బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, పంటను ప్రభుత్వంకు విక్రయించుకునేందుకు ఈ కార్డులు దోహదం చేస్తాయన్నారు. కౌలుకు సాగు చేసే రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో వివరాలను నమోదు చేసుకుని గుర్తింపు కార్డులు పొందాలని సూచించారు. పలువురు రైతుల నుంచి వివరాలను సేకరించారు. గ్రామ రెవెన్యూ అధికారి వెంకటేశ్వర్లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నేడు సింహమంటి చిన్నోడు సాంఘిక నాటక ప్రదర్శన



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శివనాగేశ్వరరావు

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో శుక్రవారం రాత్రి 9 గంటలకు సింహమంటి చిన్నోడు సాంఘిక నాటకాన్ని ప్రదర్శిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్, గోల్డ్ డైరెక్టర్ గంపల శివనాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక రైల్వేస్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాటకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమకాలిన రాజకీయాలకు అర్థంపట్టే సింహమంటి చిన్నోడు నాటికను సరికొత్త కథనంతో రాజకీయ నాయకులకు కన్ను విప్పు కలిగే విధంగా రూపొందిస్తున్నట్లు చెప్పారు. కుటుంబ ప్రయోజనాలు కోసం కాకుండా సమాజం కోసం భావితరాల భవిష్యత్ కోసం నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బెల్లంకొండ వెంకట్, రామరాజు, శ్రీనివారాసరావు, హైమరావు, రమేష్‌బాబు, విజయసారధిబాబు, లక్ష్మణరాజు, కొండంరాజు, రోజా, కొమలి, సంధ్య, ఆశోక్ గజపతిరాజు, లక్కరాజు బాబ్జి, గోపిరాజు, శ్రీనివాసారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాక్‌తో యుద్ధానికి మాజీ సైనికులు సైతం సిద్ధం

- పాక్‌తో యుద్ధానికి మాజీ సైనికులు సైతం సిద్ధం
- ఏపీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు



మాట్లాడుతున్న శంకరరావు

తెనాలి: పాకిస్థాన్ తో యుద్ధానికి లక్షమంది మాజీ సైనికులు సిద్ధంగా ఉన్నారని ఆంధ్రప్రదేశ్ మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోటూరి శంకరరావు చెప్పారు. పహల్గామ్‌లో పర్యాటకులపై ఉగ్రదాడి, పాకిస్తాన్‌లోని ఉగ్రస్థావరాలపై భారత్ దాడుల నేపథ్యంలో ఆయన గురువారం సాయంత్రం స్థానిక 'మా-ఏపీ' కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశరక్షణ కోసం పాకిస్తాన్‌తో యుద్ధం చేయాల్సి వస్తే మాజీ సైనికుల సేవలను భారత ప్రభుత్వ రక్షణ శాఖ ఉపయోగించుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 'మా-ఏపీ'లో కొందరు మాజీ సైనికులు సభ్యులుగా వున్నారని సంస్థ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా తెలిపారు. యుద్ధం అనగానే వారందరూ ఉద్విఘ్నతతో ఉన్నారని చెప్పారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఆర్గ నైజింగ్ కార్యదర్శి ఇనంపూడి రత్న ప్రసాద్ మాట్లాడుతూ, సెలవుల్లో ఉన్న సైనికులను విధులకు పిలిపిస్తున్న నేపథ్యంలో గతంలో యుద్ధ భూమికి వెళ్లిన అనుభవంతో మాజీ సైనికులను కూడా ఆహ్వానించాలని సూచించారు. పెహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా ఆపరేషన్ సింధూర్‌తో దెబ్బకు దెబ్బతీయటం గొప్పగా ఉందని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుసులూరి లక్ష్మీనారాయణ చెప్పారు. వీరితో మాజీ సైనికుల సంక్షేమ సంఘ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వాకా ఆదినారాయణ ఉన్నారు.

డాక్టర్ జాన్‌పాల్‌కు ఘన సత్కారం



డాక్టర్ జాన్‌పాల్, సుధారాణి దంపతులను సత్కరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నాగవేణి

తెనాలి రూరల్: బెంగళూరులోని న్యూ విజ్డమ్ బైబిల్ కళాశాల నుంచి ఇటీవల డాక్టరేట్ పొందిన పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చి అధినేత బిషప్ డాక్టర్ పినపాటి జాన్‌పాల్‌ను పలువురు ప్రముఖులు సత్కరించారు. చర్చి ఆవరణలో బుధవారం రాత్రి జరిగిన సన్మాన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ ప్రముఖులైన బిషప్ పాముల పరంజ్యోతి, బిషప్ ప్రవర్ధన్ వర్మ, బిషప్ విక్టర్ పాల్, దైవజనులు సువర్ణరాజు, మల్లవరపు విజయ్‌కుమార్, జూనియర్ థామస్, విలియంకేరి, రజనీకాంత్, సమాజ్‌వాది పార్టీ నాయకుడు తమనం భూషణం అతిథులుగా పాల్గొన్నారు. జాన్‌పాల్ చేస్తున్న పరిచర్యతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు. డాక్టర్ జాన్‌పాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని రాక్ గాస్పెల్ చర్చి ఆవరణలో ఉదయం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు. అయన్ను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరు శ్రీనివాసరావు, ఆరె దానియేలు, కసుకుర్తి భాస్కరరావు, జయరాజు, కఠెవరపు ఏసుదాసు, పినపాటి ఫ్రాన్సిస్, ఈవూరి ఏసురత్నం, సంఘస్తులు, తెనాలి, గుంటూరు, పరిసర ప్రాంతాలకు చెందిన పలువురు దైవజనులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవం

జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్



మెమెంటోలు, సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో జిల్లా అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్లటౌన్: పిల్లలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి అవసరాలు తీర్చే తల్లిదండ్రులే వారికి ప్రత్యక్ష దైవమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ అన్నారు. బాపట్ల పురపాలక సంఘం సహకారంతో 10 రోజులపాటు సాగిన స్టూడెంట్ ఇంటిలెక్చువల్ ఫోరం(సిఫ్) కార్యక్రమం గురువారంతో ముగిసింది. ప్రముఖ అబ్జర్వేషన్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ ఆధ్వర్యంలో ముగింపు సమావేశం మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో జరిగింది. అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ మాట్లాడుతూ.. 'ఈ తరంలో మేము ప్రత్యేకం' అను శీర్షికతో చిన్నారుల్లో చైతన్యం నింపడం హర్షణీయమన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తల్లిదండ్రుల పట్ల భక్తి భావన కలిగి ఉండాలని వారిని మించిన దైవం మరొకటి లేదని, గురువులను కూడా దైవంగా భావించాలన్నారు. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని రూపొందించి అమలు చేసిన అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణను మున్సిపల్ కమిషనర్ అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో మేలు చేస్తాయని ఈ తరం విద్యార్థుల్లో ఉన్న రుగ్మతలను రూపుమాపడానికి ఈ కార్యక్రమం ఒక ఆయుధం లాంటిదని అన్నారు. విద్యార్థి దశ నుంచే హానికరమైన జంక్ ఫుడ్‌ను మానేయడం, సమయాన్ని, సామర్థ్యాన్ని వృథా చేసే సెల్ ఫోన్ వీడియో గేమ్‌ల వాడకాన్ని వదిలేయడం, తల్లిదండ్రులు ఆశించే ఫలితానికి అనుగుణంగా ప్రణాళికలను రూపొందించుకుంటూ కృషి చేయాలన్నారు. ఈ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు ఆహ్లాదకరాన్ని ఇచ్చే ఫోక్, వెస్ట్రన్, ముత్యాలపై శిక్షణ, యోగా, ధ్యానం పాఠశాలల్లో చదువును సులభంగా చదవడానికి అవలంభించాల్సిన మెలకువలపై శిక్షణ ఇవ్వడం హర్షణీయన్నారు. అనంతరం శిక్షణ తరగతులు పూర్తిచేసుకున్న విద్యార్థులకు మెమెంటోలు, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కరాటే శిక్షకులు యర్రా నాగేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

తెనాలిరూరల్: అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తెనాలి చెంచుపేటలోని ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారని డీఎస్పీ బి. జనార్ధనరావుకు గురువారం సమాచారం రావడంతో అక్కడికి వెళ్లారు. 50 బస్తాల్లో రేషన్ బియ్యాన్ని, మరో 15 బస్తాల్లో నూకలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇండస్ట్రియల్ ఎస్టేట్ కేంద్రంగా రేషన్ దందాకు పాల్పడుతున్న వ్యక్తే మరోసారి అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్నాడని పోలీసుల విచారణలో వెల్లడైంది. బియ్యం తరలించేందుకు సిద్ధంగా ఉంచిన వాహనాన్ని పోలీసులు పరిశీలించారు. రేషన్ అక్రమాలకు పాల్పడుతున్న వ్యక్తిపై ఏం చర్యలు తీసుకుంటారో వేచి చూడాలి.

దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయండి



తెనాలిరూరల్: సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, షేక్ హుస్సేన్ వలి హమాలీలను కోరారు. గురువారం తెనాలి పినపాడులోని పౌరసరఫరాల స్టాక్ పాయింట్ గోడౌన్ వద్ద హమాలీలను కలిసి మే 20న నిర్వహించబోయే సార్వత్రిక సమ్మె ప్రాధాన్యతను వివరించి సమ్మె ర్యాలీలో పాల్గొనాలని సూచించారు. అనంతరం హమాలీలతో కలసి సమ్మెకు మద్దతుగా నినాదాలు చేశారు. ఆయన వెంట సీఐటీయూ నాయకుడు షేక్ హుస్సేన్ వలి ఉన్నారు.

రెడ్ క్రాస్ సేవలు విస్తరించాలి

తెనాలి సబ్‌కలెక్టర్ సంజనా సింహ



జీన్ హెన్రీ డ్యూనంట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన సంజనా సింహ

తెనాలి: ప్రకృతి విపత్తులలో సహాయ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, రక్తదాన శిబిరాలు, ప్రథమ చికిత్స శిక్షణ శిబిరాలు, పునరావాస సేవాకార్యక్రమాలతో రెడ్‌క్రాస్ సేవలు అన్ని వర్గాల వారికి విస్తృతస్థాయిలో అందుతున్నాయని తెనాలి సబ్‌కలెక్టర్ వి.సంజనా సింహ అన్నారు. మరింతగా ప్రజలకు చేరువ చేసేందుకు సమాజంలో ప్రతి ఒక్కరు రెడ్‌క్రాస్ సభ్యులుగా చేరాలని కోరారు. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక పాత ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటైన కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 'సర్ జీన్ హెన్రీ డ్యూనంట్ 'జన్మదినం రోజున ప్రపంచవ్యాప్తంగా రెడ్‌క్రాస్ వేడుకలు నిర్వహిస్తారని సర్ జీన్ హెన్నీ డ్యూనంట్ ఆశయ సాధన కోసం అందరూ ముందుకు రావాలని అభిప్రాయపడ్డారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు, ఇతర ప్రకృతి వైపరీత్యాలలో, యుద్ధ సమయాలలో రెడ్‌క్రాస్ వాలంటీర్స్ చేసే సేవలు వెలకట్టలేనివని చెప్పారు. రెడ్ క్రాస్ సేవలను అందరూ ఆదర్శంగా తీసుకొని రెడ్ క్రాస్ సభ్యులుగా చేరి సామాజిక సేవలలో తమ వంతు బాధ్యత నిర్వహించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ వేడుకలో భాగంగా ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని సబ్ కలెక్టర్ ప్రారంభించారు. తెనాలి రెడ్ క్రాస్ చైర్మన్ ముమ్మనేని భానుమతి, కోశాధికారి నాళం శ్రీమన్నారాయణ, రెడ్ క్రాస్ కార్యనిర్వాహక సభ్యులు కుర్రా శ్రీనివాస్, కొత్త కృష్ణకుమార్, కొంజేటి మురళి, డాక్టర్ పావని ప్రియాంక, రెడ్‌క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్‌కే జానీ రసూల్ పాల్గొన్నారు. తొలుత జీన్ హెన్నీ డ్యూనంట్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.


హ్యూమన్ జెనెటిక్స్‌లో దేవరపల్లి ప్రీతికి డాక్టరేట్



తెనాలి: పట్టణానికి చెందిన దేవరపల్లి ప్రీతి ప్యాటిసియాకు ఆంధ్ర యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. హ్యూమన్ జెనెటిక్స్‌లో ఆమె చేసిన పరిశోధనకు ఈ గౌరవం దక్కింది. 'కాంప్రహెన్సివ్ ఆఫ్ న్యూక్లియోటైడ్ పాలీమార్ఫిస్ అండ్ ఫంక్షనల్ ఆన్నోటేషన్స్ ఫర్ టీఎస్ఎఫ్ ఆల్ఫా, ఇన్ డయాబెటిక్ న్యూరోపతీ పేషెంట్స్' అనే అంశంపై పరిశోధన చేసి థీసిస్‌ను సమర్పించారు. చినరావూరుకు చెందిన దేవరపల్లి కిషోర్‌కుమార్ కుమార్తె ప్రీతి, స్థానిక సెయింట్‌జాన్స్ స్కూలులో పాఠశాల విద్య, సాయి జూనియర్ కాలేజీలో ఇంటర్, జేఎంజే మహిళా కాలేజీలో బీఎస్సీ, ఆంధ్ర యూనివర్సిటీలో ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ చేశారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

- చైనా కేంద్రంగా 5 వేల లోన్‌యాప్స్
- ఒక యాప్‌కు సమాచారమిస్తే మొత్తం యాప్స్‌కు ఇచ్చినట్టే
- అవగాహన సదస్సులో సైబర్ క్రైమ్, గుంటూరు ఇన్‌చార్జ్ రాజ్‌కిషోర్



మాట్లాడుతున్న రాజ్‌కిషోర్

తెనాలి: టెక్నాలజీ పెరిగిన నేటిరోజుల్లో అదేస్థాయిలో విస్తరిస్తున్న సైబర్ నేరాలపై అవగాహన కలిగివుండి అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సైబర్ క్రైమ్, గుంటూరు ఇన్‌చార్జ్ రాజ్‌కిషోర్ అన్నారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీ కాన్ఫరెన్స్ హాలులో గురువారం విద్యార్థులకు సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. యూత్ సర్వీసెస్ 'స్టెప్' ఆధ్వర్యంలో ఏర్పాటైన సదస్సుకు కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. రాజ్ కిషోర్ మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ సైబర్ నేరాల గురించి తెలియజేశారు. ముఖ్యంగా తెలియని లింక్స్ యాప్స్ ఉపయోగించవద్దని స్పష్టంగా చెప్పారు. అలానే పర్సనల్ లోన్‌యాప్స్ గురించి కూడా జాగ్రత్త వహించాలన్నారు. చైనా కేంద్రంగా దాదాపు అయిదు వేలకు పైగా లోన్ యాప్స్ ప్రస్తుతం ఇంటర్‌నెట్‌లో ఉన్నాయని, ఒక యాప్‌కు స్పందించి మనం సమాచారం ఇస్తే, అది అయిదు వేల యాప్స్‌కు చేరుతుందని చెప్పారు. లోన్‌యాప్స్‌ను ఎవరూ డౌన్‌లోడ్ చేసుకోవద్దని చెబుతూ లోన్‌యాప్‌తో ఏవైనా ఇబ్బందులు కలిగితే వెంటనే మొబైల్‌లోని సిమ్‌ను తొలగించి, ఒక వారం తర్వాత మళ్లీ ఉపయోగించుకోవాలని సూచించారు. తొందరపడి ఈ కామర్స్ వెబ్ సైట్స్, యాప్స్‌లో పర్సనల్ డేటాని ఇవ్వొద్దని తెలిపారు. డిజిటల్ శకంలో ఎక్కువగా ఉన్న భారత యువత ఎంత జాగ్రత్త వహిస్తే అంత సురక్షితంగా ఉంటారని చెప్పారు. 'స్టెప్' సీఈవో చంద్రముని, రాధిక, ఏఎస్ఐ జార్జ్ బాబు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి



తెనాలిటౌన్: రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో గురువారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో టీబీకి మందులు వాడుతున్న పలువురుకి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ క్షయ వ్యాధి నివారణ లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గ్రామాలన్ని క్షయరహిత గ్రామాలుగా ఉండేందుకు కృషి చేస్తున్నటుల వెల్లడించారు. క్షయవ్యాధి ఉన్న రోగుల కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా అవసరమైన జాగ్రత్తలు వివరిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ యూనిట్ సూపర్‌వైజర్ పి.రవికుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, ఆశా వర్కర్లు,హెల్త్ విజటర్‌లో పాల్గొన్నారు.